క్లుప్తంగా

మినుము విత్తనాలు పంపిణీ



గూడూరు: మినుము విత్తనాలను 80 శాతం సబ్సిడీపై రైతులకు ప్రభుత్వం ఇస్తోందని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. సబ్సిడీ మినుము విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం గూడూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంత్రి జోగి రమేష్ చొరవతో గూడూరు మండలానికి 100 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయన్నారు. రూ.138 విలువ కలిగిన విత్తనాలను 80 శాతం సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పారు. విత్తనాలు అన్ని ఆర్బీకేలలో అందుబాటులో ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఫైజుల్ రహ్మాన్, వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్ణం పెదబాబు, ఏటి శివప్రసాద్, వేము ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి పైడమ్మ జాతర



పెడన: పట్టణంలోని పైడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఈ నెల 26వ తేదీ నుంచి 11 రోజుల పాటు నిర్వహిస్తామని దేవదాయ శాఖ ఈఓ టీవీవీ మోహనరావు తెలిపారు. జాతర మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు రంగుల కోసం ఊరేగింపుగా మచిలీపట్నం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు, ఆశాది తదితరులు ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి వాహనంపై ఉంచారు. ఈఓ మాట్లాడుతూ అమ్మవారు రంగులతో ఊరేగింపుగా వచ్చి రేయింబవళ్లు పెడన పట్టణంలో సంచరిస్తారని, అనంతరం 27న ఆలయ ప్రవేశం చేస్తారని చెప్పారు. జాతర ఉత్సవాల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీస్, పురపాలక సంఘం, రెవెన్యూ, వైద్య శాఖల సమన్వయంతో ముందుకు అడుగులు వేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ దాసు వాయునందనరావు, ఆశాది శ్యామ్, ట్రస్ట్ బోర్డు సభ్యులు తోట సాంబశివరావు, శ్రీకాకుళపు సుబ్బారావు, సూర్యనారాయణ, కోమలి, శ్రీనివాసరావు తదితరులున్నారు.

జంట నాగుల కల్యాణం



గూడూరు: రాయవరం శివాలయంలో ఇటీవల ప్రతిష్ఠించిన జంట నాగుల కల్యాణోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. రాయవరం పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని జంట నాగులకు అభిషేకాలు నిర్వహించారు.

సంఘ సభ్యునికి ఆర్థిక సాయం

బంటుమిల్లి: వేద గాయత్రి బ్రాహ్మణ సంక్షేమ సంఘ ట్రెజరర్ నందిగామ తిరుమల ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో దాదాపు నెల రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆస్పత్రి నుంచి స్వగృహానికి చేరుకున్న తిరుమలను సంఘ సభ్యులు ఆదివారం పరామర్శించారు. సంఘం ద్వారా సేకరించిన రూ. 45 వేలను అతని అకౌంట్‌కు ఆన్‌లైన్ ద్వారా పంపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు లక్కాప్రగడ శశికుమార్, అంబడపూడి కాశీవిశ్వేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

గుడివాడ టౌన్: స్థానిక 7వ వార్డు కొత్తపేటలో విజయదుర్గ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిసిన సందర్భంగా శాంతి నిమిత్తం ఈ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ఈ కార్యక్రమంలో పాల్గొని అన్నసమారాధన ప్రారంభించారు. తొలుత అమ్మవారి దేవస్థానంలో నాని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడ టౌన్: పట్టణంలో అలజడి సృష్టించినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా సహించేది లేదని టూటౌన్ సీఐ బి. తులసీధర్ అన్నారు. ఆదివారం స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొడవలు, అల్లర్లకు పాల్పడితే శిక్షలు పెరుగుతాయే తప్ప ప్రయోజనం ఉండదన్నారు. అలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరిపై పోలీసుల నిఘా ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. సమాజంలో మంచి ప్రవర్తన కనబరిస్తే రౌడీషీట్ తొలగించే అవకాశం కూడా ఉంటుందన్నారు.

యూసీల సమర్పణ.. నిధుల విడుదల

- రెండు విడతలుగా పెడనకు రూ.30 లక్షలు విడుదల
- ఖర్చు చేసిన వాటికి బిల్లులు ఇవ్వాలన్న కేంద్రం
- బిల్లులు ఇస్తేనే మిగిలిన వాటికి కేటాయింపులు



ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ముందు యూసీలు ఆన్‌లైన్ చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పెడన: కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసే ఆర్థిక సంఘం నిధుల వ్యయం, ఇప్పటి వరకు విడుదల చేసిన వాటికి (యుటిలైజేషన్ సర్టిఫికెట్లు) లెక్కలను కోరుతోంది. వాటికి సంబంధించిన బిల్లులు పంపిస్తేనే మిగిలిన నిధులు విడుదల చేస్తామని స్పష్టమైన ఆదేశాలు రావడంతో ఆయా పంచాయతీలలో సర్పంచులకు విషయం తెలిసి తక్షణం ఆ బిల్లులు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు ఖర్చుపెట్టిన వాటికి సంబంధించిన బిల్లులను ఆన్‌లైన్ ద్వారా పంపించే చర్యల్లో నిమగ్నమయ్యారు.

పెడన మండలానికి రూ.30 లక్షలు..

పెడన మండలంలో 24 గ్రామ పంచాయతీలు, 33 గ్రామాలు, శివారు ప్రాంతాలు ఉన్నాయి. వీటన్నింటికి సంబంధించి రూ.30 లక్షలు రెండు విడతలుగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. ఈ నిధులలో 15 శాతం వాటర్ వర్క్సుకు, మరో 15 శాతం పారిశుద్ధ్యానికి వెచ్చించాల్సి ఉంది. రూ.4.50 లక్షలు చొప్పున ఈ రెండింటికి వినియోగించారు. అలాగే క్లాప్ మిత్రలకు సంబంధించిన జీతాలు కూడా 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి చెల్లింపులు చేసేలా కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. దీంతో వీరికి జీతాలు కూడా ఇందులో నుంచి ఇచ్చారు. విద్యుత్ బిల్లుల విషయానికి వస్తే అవి మినహాయించి ఇవ్వడంతో వాటర్ వర్క్స్, శానిటేషన్, క్లాప్‌మిత్రల జీతాలు పోను మిగిలిన నిధులు సీసీ రోడ్లు, డ్రైయిన్లు లేదా పంచాయతీ తీర్మానంతో చేపట్టిన అభివృద్ధి పనులకు కేటాయించి నిధులు వెచ్చించారు. వీటన్నింటికి సంబంధించి ఖర్చు చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే ప్రక్రియ వేగవంతం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బంది కంప్యూటర్ ముందు రేయింబవళ్లు కూర్చుని కసరత్తు చేస్తున్నారు.

దక్షిణాది రాష్ట్రాలంటే కేంద్రానికి చులకన..

కేంద్రంలోని బీజేపీకి దక్షిణాది రాష్ట్రాలంటే చులకన. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది 15వ ఆర్థిక సంఘ నిధులకు సంబంధించి యూసీలు ఇవ్వాలని కచ్చితంగా పేర్కొనడం, అవి సమర్పిస్తేనే మిగిలిన నిధులు విడుదల చేస్తామని చెప్పడం బ్లాక్‌మెయిల్ చేయడమే. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంపై ఈ విధంగా చేయడం చాలా బాధాకరం. ఏది ఏమైనా అధికారులు ఆలసత్వం లేకుండా చేసిన పనులకు బిల్లులు తక్షణం సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కోరాం. ఆ విధంగా వారు శ్రమిస్తున్నారు.

– గరికపాటి వెంకట రామానాయుడు, సర్పంచు, పెనుమల్లి

రెండు విడతలకు సంబంధించి యూసీలు అడిగారు

పెడన మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు రెండు విడతలుగా 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.30 లక్షలు విడుదలయ్యాయి. వీటికి సంబంధించి పంచాయతీల వారీగా నిధులు కేటాయింపులయ్యాయి. ఆ నిధులు ఏయే పంచాయతీ ఎంత ఖర్చుపెట్టిందనే వివరాలను ఆయా పంచాయతీ కార్యదర్శులు లెక్కలు వేసి, వాటికి సంబంధించిన బిల్లులను ఆన్‌లైన్‌లో నివేదికలు పంపిస్తున్నారు. రెండు విడతలకు సంబంధించి తప్పనిసరిగా యూసీలు(యుటిలైజేషన్ సర్టిఫికెట్లు) సమర్పిస్తేనే మిగిలిన రెండు విడతల నిధులు ఇస్తామని పేర్కొనడంతో వాటిని సమర్పించడానికి శ్రమిస్తున్నాం.

– ఎం. జయరామ్, ఈఓపీఆర్డీ, పెడన మండలం

చిరుజల్లులతో రైతుల ఆందోళన

- మారిన వాతావరణం
- హడావుడిగా వ్యవసాయ పనులు



వి.కొత్తపాలెంలో వరి కోత కోస్తున్న కూలీలు

కోడూరు: వాతావరణంలో వచ్చిన మార్పులకు ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు వ్యవసాయ పనులను హడావుడిగా చేస్తున్నారు. కోడూరు, చుట్టు పక్కల గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశంలో మబ్బులు కమ్ముకొని మధ్యాహ్న సమయంలో చిరుజల్లులు పడ్డాయి. చలిగాలుల తీవ్రత కూడా అధికమైంది. ఇప్పటికే మిచాంగ్ తుపాను కారణంగా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. నేలవారిన పొలాలను కట్టలు కట్టించుకున్న అన్నదాతలు నాలుగు రోజుల నుంచి ముమ్మరంగా వరికోతలను ప్రారంభించారు. కోడూరు, వి.కొత్తపాలెం, మాచవరం, విశ్వనాథపల్లి, లింగారెడ్డిపాలెం, పిట్టల్లంక, ఉల్లిపాలెం, నక్కవానిదారి, జరుగువానిపాలెం, మందపాకల, పోటుమీద, దింటిమెరక గ్రామాల్లో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో కోతలు పూర్తిచేసి ప్రస్తుతం పంట పనపై ఉంది. మరికొన్ని ప్రాంతాల్లో పనపై ఉన్న పంటను కట్టేత కట్టి కుప్పలు వేస్తున్నారు. యంత్రాల సహాయంతో కోత పూర్తి చేసిన రైతులు ధాన్యాన్ని ఇళ్లకు చేర్చుకుంటున్నారు. మరో 15 రోజుల్లో కోతలు, కుప్పలు పూర్తవుతాయని, అప్పటివరకు వరుణదేవుడు కరుణిస్తే వరిపంట సక్రమంగా ఇంటికి చేరుతుందని అన్నదాతలు చెబుతున్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

గోదాదేవికి అమ్మవారికి ప్రత్యేక పూజలు




ప్రత్యేక అలంకారంలో అమ్మవారు ; ఉత్సవ మూర్తుల అలంకారం

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి మూలమూర్తికి తొలి రోజు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వార్ల ఉత్సవమూర్తులకు తిరుమంజనసేవ నిర్వహించారు. తిరుప్పావై పాశుర పఠనాన్ని భక్తిప్రపత్తులతో ప్రారంభించారు. నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు ఉంటాయని అష్టాక్షరీ స్వామీజీ తెలిపారు. కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస పూజలను ప్రారంభించారు. మహిళలు వేకువజామునే ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించుకున్నారు.

పెన్షనర్లకు సన్మానం



అవనిగడ్డలో పెన్షనర్లు సత్కరిస్తున్న నాయకులు

అవనిగడ్డ: స్థానిక పెన్షనర్స్ భవనంలో ఆదివారం సీనియర్ పెన్షనర్స్‌ను సత్కరించారు. ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీనియర్స్ పెన్షనర్స్ బి. ఘంటేశ్వరమ్మ, పి. బేబీ, సీహెచ్ విష్ణువర్ధన్‌రావు, కె. అరుణప్రసాద్, వేముల శేషగిరిరావు,ఎన్. వీరరాఘవయ్యను అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి ఎం. రామకృష్ణ, అబ్దుల్ అజీజ్, ఉపాధ్యాయ పత్రిక సంపాదకుడు వై. నేతాంజనేయప్రసాద్ ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

■ **పెడన:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం పెడన శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక సత్యసాయి మందిరంలో జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మట్టా రాధాకృష్ణమూర్తి మాట్లాడారు. సమావేశంలో పలు అంశాలను చర్చించారు. అనంతరం పలువురు విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మల్లయ్య, హమీద్, ఆలీమ్ తదితరులు పాల్గొన్నారు.

■ **బంటుమిల్లి:** ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం వృద్ధాప్యంలో ఇబ్బందులు పడకుండా పింఛన్ పద్ధతిని ఏర్పాటు చేశారని బంటుమిల్లి సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీఓ) కె. గోపీకృష్ణ అన్నారు. ఆదివారం జాతీయ పెన్షనర్స్‌డే సమావేశాన్ని స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు సీహెచ్ గంగాజలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న పలు కార్యక్రమాల నివేదికను అధ్యక్షుడు గంగాజలరావు వివరించారు. కార్యక్రమంలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన పెన్షనర్లు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ ఏర్పడింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

మండవల్లి: భైరవపట్నం శుభం ఫంక్షన్ హాల్‌లో రాయల్‌క్లబ్ కైకలూరు విద్యార్థుల స్కాలర్‌షిప్ మహోత్సవం ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. ఇంజరం గ్రామానికి చెందిన నృత్య గాయని దొండపాటి హేమ స్వాగత గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. 24 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.లక్షా 20 వేలు పంపిణీ చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీడియెట్, డిప్లమో, డిగ్రీ, బీటెక్ కోర్సులలో చదువుతున్న ప్రతిభ కనబరచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యఅతిథి రిటైర్డ్ జాయింట్ కమిషనర్ (స్టేట్ టాక్స్) సీతాలం రాంబాబు మాట్లాడుతూ రాయల్ క్లబ్ శాఖలు భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని చేస్తున్న సేవలను కొనియాడారు. దాతలుగా వ్యవహరించిన డాక్టర్ సుధాబత్తుల విజయ్‌కుమార్, ఆర్.విజయ్ కుమార్, యూ. నగేష్, పి.రామకృష్ణ, ఎస్.శ్రీనివాస్, సీహెచ్. విజయ్ కుమార్, వి.జైచంద్ర బి.స్వామిలను పలువురు వక్తలు ప్రశంసించారు. రాయల్ సర్వీసెస్ ట్రస్ట్ చైర్మన్ పి. పుల్లయ్య, కోశాధికారి జి.రామారావు, ఎస్. కృష్ణ, ప్రొఫెసర్ ఎస్.విజయ్‌కుమార్, పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు ప్రారంభం



స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ షష్ఠి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్వామివారిని పెండ్లికుమారుడిగా వల్లీదేవసేన అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ముస్తాబు చేశారు. తొలుత స్వామి వారికి సహాయ కమిషనర్ నేల సంధ్య, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి ఉత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లకు మార్గశిర శుద్ధ షష్ఠి సందర్భంగా సోమవారం రాత్రి స్వామి అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతుందని సహాయ కమిషనర్ తెలిపారు. ఇందులో పాల్గొనే దంపతులు రూ.1,516 రుసుంగా చెల్లించాలన్నారు. సంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించి కల్యాణంలో పాల్గొనాలని కోరారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు దంపతులు సోమవారం తెల్లవారుజామున స్వామివారి పుట్టలో పాలు పోసి ఉత్సవాల్లో పాల్గొంటారన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్



కేక్ కట్ చేస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్(వలివర్తిపాడు): గుడివాడ రూరల్ మండలం వలివర్తిపాడు గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రముఖుడు కలపాల కిరణ్, గ్రామ యూత్ ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ప్రముఖ ప్రసంగీకులు రాజా క్రిస్టియన్ క్రీస్తు శుభ సందేశాన్ని అందించారు. తొలుత కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, నాయకులు వల్లూరిపల్లి సుధాకర్, చుండూరి శేఖర్, యూత్ సభ్యులు స్వరూప్, సాత్విక్, అఖిల్, ప్రశాంత్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

దైవ సేవకులకు..

తోట్లవల్లూరు: దైవ సేవకులకు క్రిస్మస్ కానుకల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మండలంలోని పెనమకూరు, చాగంటిపాడు శివారు ఆళ్లవారిపాలెం, కళ్లంవారిపాలెం గ్రామాల్లో పాస్టర్లకు క్రిస్మస్ కానుకలను పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, చాగంటిపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు ఆళ్ల సాంబిరెడ్డి, పెనమకూరు సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ సభ్యుడు మరీదు మధుబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

పెదమద్దాలి(పామర్రు): మండలంలోని పెదమద్దాలి గ్రామంలో సెయింట్ పాల్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. చర్చి పాస్టర్ సమ్మంగి కృష్ణపాల్ మాట్లాడుతూ స్థానికులు కంభం నిర్మలమ్మ నిరుపేదలైన వితంతువులకు చీరలను పంపిణీ చేశారన్నారు. క్రీస్తు విశ్వాసులు సమ్మంగి నరేష్, స్థానికులు పాల్గొన్నారు.

ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయం

పామర్రు: ఏసు క్రీస్తు బోధనలు అనుసరణీయమని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక సచివాలయం-1 ప్రాంగణంలో ఐక్య క్రిస్మస్ వేడుక కార్యక్రమం పామర్రు టౌన్, పామర్రు నియోజకవర్గ క్రైస్తవ సంఘ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ క్రైస్తవుల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నో సంక్షేమపథకాలను అందిస్తోందని అన్నారు. రానున్న కాలంలో మరలా సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపైన ఉన్నదని అన్నారు. గ్రామ సర్పంచ్ కె.కస్తూరి, ఏఎంసీ డైరెక్టర్ కూసంపెద వెంకటరెడ్డి, పాస్టర్స్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల, రెవరెండ్ డాక్టర్లు వి.పరిశుద్ధరాజు, కేజే విక్టర్ పాల్, వై సంగీతరావు, టీ పీటర్ సాల్మన్, జి.కృపాసాగర్, కె.సువర్ణరాజా, ఎస్.విజయ్‌కుమార్, టి.ఎలీషా, కె.శ్రీనివాస్, సునీల్, చంటిబాబు, ఎస్. శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ డీఎస్పీకి డీజీపీ మెడల్



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా మెడల్ అందుకుంటున్న డీఎస్పీ మురళీధర్

అవనిగడ్డ: అవనిగడ్డ డీఎస్పీ పి. మురళీధర్ ఉత్తమ సేవలకు గాను డీజీపీ మెడల్ అందుకున్నారు. ఇటీవల మిచాంగ్ తుపాను సందర్భంగా ప్రాణ నష్టం లేకుండా అందరినీ అప్రమత్తం చేయడం ద్వారా సేవలందించిన డీఎస్పీకి ఈ అవార్డు లభించింది. మొత్తం ఐదుగురు డీఎస్పీలు ఈ అవార్డు అందుకోగా మురళీధర్‌తో పాటు గతంలో ఇక్కడ పనిచేసిన పోతురాజు అవార్డు అందుకోవడం విశేషం. ఈ మేరకు వారు మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో డీజీపీ కె. రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా డీజీపీ మెడల్ అందుకున్నారు. డీఎస్పీ మురళీధర్‌ను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు అభినందనలు తెలిపారు.

500 మందికి కళ్లజోళ్లు పంపిణీ



గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం తమిరిశ గ్రామంలోని ఉమా స్పిన్‌టెక్స్ ప్రాంగణంలో ఆదివారం ఉచిత కళ్లజోళ్ల పంపిణీ జరిగింది. పిన్నమనేని కోటేశ్వరరావు ఎడ్యుకేషన్ అండ్ మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల నిర్వహించిన వైద్య శిబిరాల్లో 700 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 500 మందిని గుర్తించి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ ట్రస్ట్ తరుపున నిర్వహిస్తున్న వైద్యశిబిరాల్లో అవసరమైన వారికి ఉచిత వైద్యాన్ని అందిస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని వైద్యశిబిరాలు నిర్వహించి వైద్య సేవలు మెరుగు పరుస్తామన్నారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ పీఎస్ఆర్‌కే ప్రసాద్, నేత్రవైద్యులు డాక్టర్ షరీఫ్, కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య పాల్గొన్నారు.

90 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, వస్త్రదానం



సరుకులు, వస్త్రాలు అందిస్తున్న సీఐ నాగప్రసాద్, డాక్టర్ సురేష్-రోజా

చల్లపల్లి: రెండు దశాబ్దాలుగా సమాజానికి ఐవీఎం సురేష్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక కోమలానగర్ పాత ప్రభుత్వాస్పత్రి ఓపీ సెంటర్ మురికివాడ, విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన మురికివాడల్లో జీవిస్తున్న 90 నిరుపేద ఎస్టీ కుటుంబాల వారికి రూ.3 లక్షల వ్యయంతో నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఐవీఎం డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్-రోజా దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ ముఖ్య అతిథిగా విచ్చేసి సెమీ క్రిస్మస్ సందర్భంగా నూతన వస్త్రాలు, సరుకులు అందజేశారు.

ఆర్థిక సాయం అందజేత

బండికోళ్లంక(మోపిదేవి): కొక్కిలిగడ్డ శివారు బండికోళ్లంకకు చెందిన గూడపాటి వెంకటేశ్వరరావుకు శ్రీ రామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్‌కిషోర్ నాయుడు రూ. ఏడు వేలు ఆర్థిక సాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావు లేవలేని స్థితిలో మంచం మీదే ఉంటున్నాడని తెలుసుకున్న శ్యామ్‌కిషోర్ నాయుడు ఈ మొత్తాన్ని అందజేశారు.

సాగరతీరంలో పర్యాటకుల సందడి



కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చి సందడి చేశారు. చిన్నారులు ఇసుకతిన్నెలపై కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. యువత వివిధ ఆటలతో సరదాగా గడిపారు. పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు, అటవీ అధికారులు పర్యవేక్షించారు.